
సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 26 । నవంబర్ । 2023



హాకీ టోర్నీ ప్రారంభం

పాఠశాలల హాకీ టోర్నీలో భాగంగా తొలి రోజు జరిగిన పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల జట్లు విజయం సాధించాయి. 8లో



పుణ్యనదీ హారతి రేపు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. 8లో



అంధుల క్రికెట్ పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి అంధుల క్రికెట్ పోటీలకు అంధ బాలికల ప్రభుత్వ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. 8లో

జనమే జనం

- పెందుర్తి నియోజకవర్గంలో వెల్లువెత్తిన సామాజిక చైతన్యం
- సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం
- జగన్ నినాదంతో మార్మోగిన సభా ప్రాంగణం

పెందుర్తి నియోజకవర్గం సబ్బవరంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభకు హాజరైన జనసందోహం



పెందుర్తి/ సబ్బవరం: సబ్బవరం జన సంద్రమైంది.. ఎటు చూసినా జనమే.. అందరి ముఖాల్లో ఆనందం .. అంతటా జగన్ నినాదం.. సబ్బవరంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు భాగస్వాములయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆయా వర్గాలకు చేసిన మేలును స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వివరిస్తుంటే.. జనం చప్పట్లతో పెద్ద ఎత్తున స్వాగతించారు. జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలు చేస్తూ తమ మద్దతును గట్టిగా ప్రకటించారు. మొత్తానికి సబ్బవరంలో జరిగిన యాత్ర జన సునామీని తలపించింది.

యాత్ర సాగిందిలా..

- సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా పెందుర్తి నియోజకవర్గం వేపగుంట కూడలి వద్ద వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు నందిగం సురేష్, డాక్టర్ భీశెట్టి సత్యవతి, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్‌లను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సారథ్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.
- వేపగుంట కూడలిలోని మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వేపగుంటలో డిప్యూటీ సీఎం బూడి, మంత్రి గుడివాడ, ఎమ్మెల్యేలు ప్రెస్‌మీట్ నిర్వహించారు.
- వేపగుంట కూడలి నుంచి ప్రారంభమైన యాత్ర పురుషోత్తపురం, సుజాతనగర్, చినముషిడివాడ, పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా.. భారీ బైక్ ర్యాలీ నడుమ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరకు సాగింది.
- ప్రభుత్వం మంజూరు చేసిన రూ.8 కోట్ల నిధులతో పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మించిన అదనపు భవనాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.
- అక్కడి నుంచి తిరిగి ర్యాలీగా బయలుదేరి పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి, సాధుమఠం, రాంపురం మీదుగా పినగాడి సమీపంలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ నివాసం వద్దకు యాత్ర చేరుకుంది.
- భోజన విరామం అనంతరం పినగాడి, చిన్నయ్యపాలెం, సబ్బవరం పాతరోడ్డు, జోడుగుళ్ల మీదుగా రోడ్లకిరువైపులా బారులు తీరిన ప్రజలకు అభివాదం చేస్తూ.. నాయకులు సబ్బవరం మూడు రోడ్ల కూడలిలోని సభావేదిక వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక మార్గం ద్వారా సభావేదిక మీదకు వెళుతున్న నాయకులపై ప్రజలు పూల వర్షం కురిపిస్తూ ఘనంగా ఆహ్వానించారు.
- బహిరంగ సభలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష, రీజినల్ కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్ సీపీ యువత 'గిరా గిరా తిరుగుతుంది ఫ్యాన్' సాంగ్‌కు డ్యాన్స్‌లు చేసి అందరినీ ఉత్తేజపరిచారు.

యాత్రలో రాష్ట్ర శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కంతిమహంతి అనూష పట్నాయక్, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరాం, యలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, చోడవరం నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, మహిళా విభాగం రీజినల్ ఇన్‌చార్జిలు పీలా వెంకటలక్ష్మి, బి.పద్మావతి, సీఈసీ సభ్యులు శ్రీకాంతరాజు, పైలా శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులపై పూలవర్షం,



పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



బైక్ ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు

సీఎం జగన్‌తో సమన్యాయం

సబ్బవరాన్ని జన సముద్రం ముంచెత్తింది. అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.30 లక్షల కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాం. గత టీడీపీ ప్రభుత్వం బీసీలను వాడుకుని మోసం చేసింది. సీఎం జగన్ సామాజిక సాధికారతకు కొత్త అర్థం చెప్పారు. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సమాన అవకాశాలు కల్పించారు.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

ప్రభుత్వానికి మద్దతు తెలిపేందుకు వచ్చిన మిమ్మలను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. విద్య, వైద్య రంగాలపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్ర భవిష్యత్ కోసం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలి.

– భీశెట్టి వెంకట సత్యవతి, అనకాపల్లి ఎంపీ

సాధికార యజ్ఞం జరుగుతోంది

రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. చంద్రబాబు పలు సందర్భాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను అవమానాలకు గురిచేశారు. సామాజిక సాధికారత కోసం సీఎం జగన్ యజ్ఞం చేస్తున్నారు. – గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే

సీఎం జగన్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

పెందుర్తి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాష్ట్రంలో జరుగుతున్న మేలు దేశంలో మరెక్కడా జరగడం లేదని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. సామాజిక సాధికారతలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శనివారం ఆయన వేపగుంటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి పేద, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మంత్రులుగా అవకాశం ఇచ్చారని, ఇందులో ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులిచ్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. మరోవైపు బలహీన వర్గాల కోసం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి.. వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ సౌకర్యాలు కల్పించారన్నారు. 2014 ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి చంద్రబాబు మహిళలను మోసం చేస్తే.. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ డ్వాక్రా రుణమాఫీ చేశారన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి సామాజిక పింఛన్ రూ.3వేలు కానుందన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ఇళ్ల వద్దకే పథకాలు అందించడం దేశ చరిత్రలోనే మొదటిసారి అని వివరించారు. నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభు త్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చేసిన మేలు వివరించడమే సామాజిక సాధికార బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, పూలే ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు క్షేత్రస్థాయిలో సంక్షేమ ఫలాలు అందాయిని, అందుకే ప్రభుత్వానికి మద్దతుగా సామాజిక సాధికార యాత్రలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు.

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో.. నాయీ బ్రాహ్మణులు తమ సమస్యలు చెప్పుకోవడానికి వెళితే 'వీళ్లని ఎవరు లోపలికి రానిచ్చారు'అని, మత్స్యకారులు సమస్యలు చెప్పుకుంటుంటే 'తోకలు కత్తిరిస్తా' అని చులకన చేసి మాట్లాడటం ఎవరూ మరచిపోరన్నారు. జెర్రిపోతులపాలెంలో ఎస్సీ మహిళను వివస్త్రను చేసిన నీచమైన పాలన టీడీపీది అని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, అనకాపల్లి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఇన్‌చార్జి వీసీగా ఆచార్య సమత బాధ్యతల స్వీకరణ

ఏయూక్యాంపస్ : ఏయూ ఇన్‌చార్జి వీసీగా ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ కార్యాలయంలో కలిసి అభినందించారు. విభాగాధిపతులు, డీన్‌లు, ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



ఇన్‌చార్జి వీసీని అభినందిస్తున్న రిజిస్ట్రార్

నేవీ డేకు పటిష్ట భద్రత

దొండపర్తి: నేవీ డే సందర్భంగా డిసెంబర్ 4వ తేదీన బీచ్ రోడ్డులో జరిగే వేడుకలకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో నేవీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. నేవీ డే సందర్భంగా నగరానికి పలువురు వీవీఐపీలు వచ్చే అవకాశం ఉండడంతో వారి భద్రతతోపాటు వేడుకలకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, వీఐపీ కాన్వాయ్‌లు, వాటిని నిలిపే ప్రాంతాలు, అధికారులు, సిబ్బంది వసతి ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో డీసీపీలు కె.శ్రీనివాసరావు, ఆనందరెడ్డి, నగర ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

హాకీ టోర్నీ ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: పాఠశాలల హాకీ టోర్నీలో భాగంగా తొలి రోజు జరిగిన పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల జట్లు విజయం సాధించాయి. రైల్వే న్యూకాలనీ ప్రభుత్వ పాఠశాల 4-0 గోల్స్‌తో సింహాచలం ఉన్నత పాఠశాలపై విజయం సాధించింది. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 0-3తో ఇస్లాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో మ్యాచ్‌లో పరాజయం పాలయినా 0-5తో మధురవాడ ఎస్ఎఫ్ఎస్ పాఠశాలపై విజయం సాధించింది. ఫ్రెండ్స్ హాకీ సంఘం, హాకీ విశాఖ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలో జరుగుతున్న ఈ పోటీలను ప్రిన్సిపాల్ జీఎస్‌కే చక్రవర్తి ప్రారంభించారు. ఈ పోటీల్లో బాలురు ఎనిమిది జట్లు, బాలికలు నాలుగు జట్లు పాల్గొంటున్నాయి.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఈశ్వరరావు, గాయపడిన దేముడమ్మ

మర్రిపాలెం : రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. ఈ ఘటన శనివారం కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈశ్వరరావు (55) వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాడు. శనివారం 9.15 గంటలకు భార్య దేవుడమ్మ (50)తో కలిసి స్కూటీపై సొంతూరు దేవరాపల్లి మండలం రైవాడ బయలుదేరాడు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో ఎదురుగా వస్తున్న కారు స్కూటీని ఢీకొనడంతో ఇద్దరూ కిందపడిపోగా తీవ్రగాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన కేజీహెచ్‌కి తరలించగా ఈశ్వరరావు అప్పటికే మృతి చెందగా, భార్య దేవుడమ్మ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని వారి కుమార్తె కోరాడ ఆదిలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈశ్వరరావు హెల్మెట్ ధరించి ఉన్నా ఇలా జరగడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ కేసును ఐదవ పట్టణ సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శీర ఈశ్వరరావు, దేముడమ్మ (ఫైల్)

వాల్ పోస్టర్లు అతికించిన వారిపై చర్యలు

జరిమానా విధించాలని జీవీఎంసీ కమిషనర్ ఆదేశం

దాబాగార్డెన్స్: బీఆర్‌టీఎస్ రోడ్లలోని గ్రీన్‌బెల్ట్ ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించి.. సంరక్షించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఆయన మద్దిలపాలెం నుంచి ఎన్ఏడీ కొత్తరోడ్డు జంక్షన్, హనుమంతవాక జంక్షన్ నుంచి అడవివరం ప్రాంతాల్లోని గ్రీన్‌బెల్ట్ ప్రాంతాలను పరిశీలించారు. జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్ రోడ్లలోని గ్రీన్‌బెల్ట్ ప్రదేశాల్లో ఆక్రమణలు తొలగించి.. శుభ్రపరచాలని టౌన్‌ప్లానింగ్ అధికారి సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. మద్దిలపాలెం నుంచి ఎన్ఏడీ వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్ ఏరియాలో ప్రస్తుతం ఉన్న బార్ బేరడ్ వైర్లను పూర్తిగా తొలగించి.. చైన్ లింక్ మెస్ ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఆస్పత్రికి ఎదురుగా ఆధునికీకరించిన బస్టాప్‌ల్లో వాల్ పోస్టర్లను అతికించి ఉండడాన్ని గుర్తించారు. ఆ బోర్డులు అతికించిన వారికి జరిమానా విధించాలని టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు. హనుమంతవాక జంక్షన్ నుంచి అడవివరం జంక్షన్ వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో అందమైన పూల మొక్కలు, పెద్ద చెట్లుగా మారే మొక్కలు వేయాలని హార్టికల్చర్ డీడీ దామోదరరావుకు సూచించారు. సింహాచలం ఘాట్ రోడ్డు ముందు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్‌రాజు, వేణుగోపాల్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శాస్త్రి, రఘునాథరావు, జోనల్ కమిషనర్ ఆర్‌వీజీ కృష్ణ, కార్యనిర్వహణ ఇంజినీర్ సుధాకర్, ప్రసాద్ ఉన్నారు.




బస్టాప్‌లో పోస్టర్లు తొలగించాలని, గ్రీన్ బెల్ట్‌లో చైన్ లింక్ మెస్ ఏర్పాటు చేయాలని సూచిస్తున్న కమిషనర్

పుణ్యనదీ హారతి రేపు

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 5.30 గంటలకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకి చెందిన కొండదిగువ వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. నక్షత్ర హారతి, కుంభ హారతి, ఆయుత దీపార్చనలు సమర్పణ ఉంటుందన్నారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణి గట్టుపై దీపాలు వెలిగిస్తారన్నారు. ప్రమిదలు, వత్తులు, నూనె దేవస్థానమే ఉచితంగా అందిస్తుందన్నారు.

జాతీయ స్థాయి అంధుల క్రికెట్ పోటీలకు ఎంపిక

కొమ్మాది: వచ్చే ఏడాది జనవరిలో హుబ్లీలో జరగనున్న జాతీయ స్థాయి అంధుల క్రికెట్ పోటీలకు బీచ్ రోడ్డులోని అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తిరుమల ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ అంధుల క్రికెట్ టీమ్ ఎంపిక పోటీల్లో ఇక్కడ విద్యార్థినులు రాజేశ్వరి, చంద్రకళ, సారిక, సుజాత అర్హత పొందినట్లు పేర్కొన్నారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి